# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రైతుల వాణిజ్య పంటలకు మెరుగైన గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులతో సమాశమయ్యారు.
- ఆంధ్రప్రదేశ్ లో పర్యాటక రంగ అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- INS అర్నాలా ఈరోజు భారత నౌకాదళంలోకి ప్రవేశించింది.

=======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు రాష్ట్ర సచివాలయంలో మామిడి, పొగాకు, కోకో పంటల మద్ధతు ధరతో పాటు వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పొగాకు, మామిడి తదితర పంట ఉత్పత్తులకు సంబంధించి నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పంట ఉత్పత్తులను వాణిజ్య కోణంలోనే చూడాలని, వీలైనంత మెరుగైన ధర వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సంవత్సరం హెచ్డీ బర్లీ పొగాకు 80 కోట్ల కిలోల మేర ఉత్పత్తి వచ్చిందని, ఇప్పటి వరకూ 27 కోట్ల కిలోల మేర విక్రయాలు జరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. మిగిలిన పొగాకును త్వరగా కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే.. పామ్ ఆయిల్ పై సుంకం తగ్గింపు, మామిడి గుజ్జుపై జీఎస్టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించే అంశంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడామని.. దీనిపై అధికారులు సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

=======================

విశాఖలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనకాపల్లి జిల్లా

ఎస్.రాయవరం మండలం, రేవు పోలవరం సముద్ర తీరం వద్ద యోగాభ్యాసన కార్యక్రమం నిర్వహించారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో, ఆయుష్ మంత్రిత్వ శాఖ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో 2 వేల మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ.. పర్యాటక ప్రాంతమైన రేవు పోలవరం సముద్ర తీరంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ఆలోచించి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని విశాఖలో నిర్వహించడం ఉత్తరాంధ్ర వాసుల అదృష్టమని పేర్కొన్నారు. దీంతో ప్రపంచం అంతా విశాఖ వైపు చూస్తోందని హోం మంత్రి మాట్లాడుతూ...

(వాయిస్ 25 సెకన్లు)

=======================

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కొనసాగుతుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అమిత్ షాతో ఈరోజు సమావేశమయ్యారు. ప్రభుత్వ ఏర్పాటై సంవత్సర కాలంలో ఎన్డీయే కూటమి సాధించిన విజయాలను, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని అమిత్ షాకు లోకేష్ వివరించారు. ఈ నెల 21వ తేదీన విశాఖలో ప్రధానమంత్రి హాజరయ్యే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ... నూతన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కొనసాగుతుందని అమిత్ షా హామీ ఇచ్చారు.

అనంతరం కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్ ను మంత్రి లోకేష్ కలిశారు. ఈ సందర్భంగా రాయలసీమను ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకారం అందించాలని కోరారు. రాయలసీమలో రైతులు మామిడి, అరటి, బత్తాయి, దానిమ్మ, డేట్స్ వంటి పండ్ల తోటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారని.. అయితే గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా అక్కడడి రైతులకు మెరుగైన ధర లభించి ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు సహకరించాని మంత్రి కోరారు. దీనిపై కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ స్పందిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తిరుపతి ట్రిపుల్ ఐటిలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి రానున్నామని కేంద్ర మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు.

విరామం

=======================

11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఈరోజు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 520 మంది పోటీల్లో పాల్గొనగా, 193 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... యోగా అనేది మన వారసత్వ సంపద అని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత యోగాకు ప్రాముఖ్యత లభించిందని, కెనడాలో జరిగిన జీ-7 సమావేశంలో కూడా యోగా గురించి ప్రధానమంత్రి మాట్లాడారని చెప్పారు. యోగాను మన జీవన విధానంలో అంతర్భాగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి పర్యాటకాన్ని తీసుకు వచ్చేందుకు, వైద్య పర్యాటకం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

=======================

సముద్ర భద్రత, పైరసీని నిరోధించడం, షిప్పింగ్ మార్గాల భద్రతలో నావికా దళాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. ఈరోజు విశాఖలో జరిగిన ఐఎన్ఎస్ అర్నాలా ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఐఎన్ఎస్ అర్నాలా ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత గల భద్రతా భాగస్వామి అని పేర్కొన్నారు. విస్తారమైన తీరప్రాంతాన్ని కాపాడటంలో INS అర్నాలా జలాంతర్గామి సామర్థ్యం, సముద్ర కార్యకలాపాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. INS అర్నాలాను ప్రారంభించే

బాధ్యతను భారత నావికాదళం స్వీకరించడాన్ని ఆయన ప్రశంసించారు. అత్యాధునిక నౌకలతో భారత నౌకాదళం బలంగా ఉందని, ఆపరేషన్ సిందూర్ కు సంబంధించిన కార్యకలాపాలలో 40 నౌకలను నియమించడం గర్వకారణమని అనిల్ చౌహాన్ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

========================

తూర్పు గోదావరి జిల్లా తాళ్లపూడి గ్రామంలో డిసిల్టేషన్ పాయింట్ వద్ద ఆరు డ్రెడ్జింగ్ బోట్లను అధికారులు సీజ్ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఇసుక తవ్వకాలపై నిషేధం అమలులో ఉన్నప్పటికీ .. బోట్స్ మ్యాన్ సొసైటీ సభ్యులు అక్రమంగా ఇసుక తవ్వకాలు నిర్వహించడంతో అధికారులు ఈరోజు బోట్లను సీజ్ చేశారు. ఈ దాడుల్లో జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి, తహసిల్దార్ లక్ష్మి లావణ్య, ఎస్.ఐ. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

========================

ఏజెన్సీ ప్రాంతంలోని అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యను బోధించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. రంపచోడవరం మండలం కోయల ఎర్రంపాలెం గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఈరోజు ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో బాలబాలికలు, గర్భిణీలు, బాలింతల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గుడ్లు, పాలు, నిత్యావసర సరకులను ఏ విధంగా సరఫరా చేస్తున్నారని ఆరా తీశారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం మధ్యాహ్నం భోజనం అందించాలని కట్టా సింహాచలం ఆదేశించారు.

========================

ఆంధ్రప్రదేశ్, యానంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. వీటి ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల్లో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. వేడి, తేమలతో కూడిన అసౌకర్యమైన వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

========================
========================